చిన్న కథ

# గుణపాఠం

"ఏమిటి నాన్నా మీరనేది? కట్నం యివ్వలేదు గనుక యిప్పుడు అత్తయ్య చెప్పిన సామానంతా కొంటారన్న మాట. 'కట్నం' యివ్వలేదని పేరే గాని మీకు ఏం ఖర్చు తప్పింది గనుక! అయినా యీ వంకతో వాళ్ళు తీసికొన్నవి చాలానే అయినాయి. మళ్ళీ యిప్పుడు యిదేమిటి? అయినా మా సంసారానికి కావలసినవి మేము కొనుక్కోలేమూ? ఎంత లేదన్నా అవన్నీ కలిపి రెండు మూడు వేలవుతాయి." అంది కోపంగా శశి తండ్రితో.

"అత్తయ్య సామానుతోపాటే నిన్ను అబ్బాయి దగ్గరకు పంపమంది. ఇంత ఖర్చా అయ్యాకా యిప్పుడు వెనకాడడం ఎందుకు?" ఆయన ముఖంలో నిస్సహాయత స్పష్టంగా కనబడుతోంది. తోడబుట్టిన చెల్లెలు తన కష్ట సుఖాలు ఆలోచించే-కట్నం వద్దందని పొంగిపోయాడుగాని యిదోరకం 'నిలువుదోపిడి' అనుకోలేక పోయాడాయన.

కాళ్ళు కడిగే చెంబు నుండి అబ్బాయి అమ్మాయి బట్టలవరకు అన్నగారి దగ్గరుండి కొనిపించింది. "ఏమిటన్నయ్యా! మరీ యింత చిన్న చెంబా కొనేది? ఎవరో పరాయి వాళ్లకు యిస్తున్నట్లు. నాకూ వాడొక్కడేగా! అన్ని అచ్చటా ముచ్చట్లు తీర్చుకోవాలని వుండదా? అక్కడికి అన్నయ్యవనీ కట్నం వద్దనే అంటిని. లాంఛనాలన్నా ఘనంగా యివ్వు." ఇలా మొదలయిన ఆవిడగారి ధోరణికి రామయ్యగారు మొదలే నీరుకారిపోయారు. ఏదో అన్నిట్లోనూ ఖర్చు తగ్గించి 'పిల్ల' పేరున వేసిన ఐదు వేలల్లో ముగించేద్దాం. ఎటూ చెల్లెలు కట్నం తీసుకోవడం లేదు - అనుకున్న రామయ్యగారు ఎనిమిది వేల పైచిలుకు ఖర్చు అయ్యేసరికి బాగా నిరాశ పడిపోయాడు. ఏదో యింతటితోనయినా పెళ్ళి ముగిసిందని తృప్తి పడటానికి వీల్లేకుండా "డబుల్ కాట్, ఫర్నీచర్, బీరువా, టేబిల్ ఫ్యాను తోనే అమ్మాయిని కాపరానికి పంపించు" అని మెత్తగా చెప్పినా ఖరాఖండిగానే చెప్పింది చెల్లెలు.

"ఇక్కడ కూర్చొని ఆలోచిస్తావేం నాన్నా? 'నావల్ల గాదు' అని అత్తయ్యతో అక్కడే చెప్పకపోయావా?" అంది శశి.

"ఎలా చెప్పనమ్మా! విశ్వం కూడ యివన్నీ కావాలన్నట్లే అభిప్రాయం వెలిబుచ్చాడు."

"ఏమిటీ! బావ కూడ ఇవి తెస్తేనే నన్ను రమ్మన్నాడా?" విపరీతమైన కోపాన్ని ఆశ్చర్యాన్నీ మిళితం చేస్తూ అడిగింది.

"అబ్బెబ్బే అలా అని గాదు" ఖంగారు పడ్డారు ఆయన. "అదే-అత్తయ్యకు మనం పెళ్లి ఘనంగా చెయ్యలేదని కోపంగా వుందిట. ఇప్పుడు యివీ కాదంటే అత్తయ్య బాధపడుతుందనేగాని వాడికి యివి కావలనేమీ పంతంలేదుట. ఎలా అయినా కనిపెంచిన వాళ్ళను ఎట్లా నిర్లక్ష్యం చెయ్యగలడు?" అన్నారు కాసేపాగి.

తండ్రి సమాధానం శశి కోపాన్ని మరింత పెంచింది.

కన్నవాళ్ళు 'వద్దు మొర్రో' అంటున్నా 'హిప్పీ క్రాప్'లు 'బెల్ బాటమ్'లు మానరు. పైగా 'పెద్దవాళ్ళది చాదస్తం' అంటూ కొట్టి పారేస్తారు. తల్లిదండ్రులకు యిష్టం లేదని తెలిసినా, పెళ్ళాలను వెంటేసుకొని తిరుగుతారు గాని ఇలాంటి విషయాల్లో మాత్రం వాళ్ళ మాట, గీచిన గీటు దాటనట్లే ప్రవర్తిస్తారు. కట్నాలు, లాంఛనాలు పేర్లతో డబ్బు గుంజుకోవాలనే తత్వం అసలు వీళ్ళల్లోనే వుంది. పైకి పెద్ద వాళ్ళను యిరికిస్తారు. తమకు మామగారి నుండి పైసా పుచ్చుకోవటం యిష్టం లేనట్లు. ఇదో రకం కపట స్వభావం.

అసలు ప్రతివారు 'కట్నమే' ముఖ్యమైన సమస్యన్నట్లు మాట్లాడుతారు. కాదనిగాదు కాని, వివాహమప్పుడు, ఆ తరువాత కూడా, "లాంఛనాలు" పేరిట జరిగే వ్యయం కట్నానికి రెట్టింపు అవుతున్నది. పైగా యివన్నీ పైకి చెప్పుకోవటానికి వీల్లేని ఖర్చులు. కట్నం ఏదో యింత మొత్తం



అని కనబడుతూ వుంటుంది.

ఇప్పుడు చూడరాదూ? 'కట్నం తీసుకోలేదన్న' ఘనత వారికి దక్కింది, నాన్నకి ఖర్చు మాత్రం కట్నం ఇచ్చి చేసిన అక్కయ్య పెళ్ళికి మించిపోయింది. పైకి చెప్పినా నమ్మరు. ఇంకా తక్కువ జరిగినట్లు గుసుపొకటి. తన ముందే ఫ్రెండ్సు "నీకేమే! లక్కీ ఫెలోవి. పైసా కట్నం లేకుండా భర్త వచ్చాడు" అంటుంటే తనకెంత వొళ్ళు మండేదో!

అయినా బావకెలా బుద్ధి లేదూ? ఆయనగారికి ఇష్టమయిన విషయాల్లో వొక్క మాటలో తల్లి నోరు మూయిస్తాడే! ఇప్పుడు మాత్రం తల్లి కష్టపెట్టుకుంటుందని చూస్తున్నాడుట.

ఈ డబ్బు తేవటానికి తన తండ్రి ఎంత కష్టపడాలి? ఆలోచనలతో మునిగిన శశి, తండ్రి మాటలకు యీ లోకంలోకి వచ్చింది.

"రేపే మూడువేలు అబ్బాయి పేర్న డ్రాఫ్ట్ పంపుతాను. ఇంత సామానూ హైద్రాబాద్ పంపటం కష్టం గదా!" అన్నారు రామయ్యగారు.

ఏదో నిశ్చయించుకున్నదానిలా మౌనంగా ఊఁ కొట్టింది శశి.

*

పోస్టులో డ్రాఫ్ట్‌తోపాటు శశి వుత్తరాన్ని ఆనందంగా అందుకుని చదవటం మొదలు పెట్టిన విశ్వం పని మెత్తని చెప్పుతో కొట్టినట్లయింది.

బావా!

నా నిర్ణయం నీకు కోపం తెప్పిస్తుందేమో. అయినా తప్పలేదు. నాకు మాత్రం రెక్కలు కట్టుకుని నీ దగ్గర వాలాలని, నీ గుండెలో తల దాచుకోవాలనీ ఉండదా? ఏం చెయ్యను. అత్తయ్య మనస్సు నువ్వు నొప్పించవు. నాన్నను నేను కష్టపెట్టలేను. నాన్న యీ మూడు వేలు పంపటానికి మార్వాడి వద్ద అప్పు చేశారు. నీకు తెలుసుగా-అది ఎంత ప్రమాదమైందో, అందుకే నేను యిక్కడ ఓ ప్రయివేటు కంపెనీలో టైపిస్టుగా చేరాను. నెలకు రు. 150/-లు యిస్తారు. దీంతో నాన్న అప్పు తీర్చి నీ దగ్గర వాలుతాను. మనిషిని దూరమైనా మనసు మాత్రం నీ చుట్టూనే వుంటుంది. అర్థం చేసుకుంటావుకదూ!

ముద్దులతో

శశి □

—కాకాని ప్రమద